# తూర్పుబడి పడమరగుడి..

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
స్థాపితం 1994
అమెరికా తెలుగు సాహిత్య వేదిక



కలశపూడి శ్రీనివాసరావు

# తూర్పు బడి.. పడమర గుడి...

నవల

## కలశపూడి శ్రీనివాస రావు


44వ ప్రచురణ

**Vanguri Foundation of America, Inc.**

**Houston, Texas & Hyderabad (India)**



“బడి గోడలు పడిపోతున్నాయి, బయలుదేరి రండి... మీ కోసం నాయుడు మాస్టారు, నేను ఎదురు చూస్తూంటాం, అని విశ్వనాథం మాస్టారు ఉత్తరం రాశారు” సోఫాలో కూర్చొని కాఫీ తాగుతున్న కొడుకు శంకరంతో అన్నారు భద్రాచలం గారు.

“అలాగా” అన్నాడు శంకరం.

“అందుకే నేను ఇండియా వెళ్ళాలనుకుంటున్నాను రా..” అని అనకూడని మాట అన్నట్లు అని, ఆయన ఊరుకొన్నారు. “ఇదిగో చూడు” అంటూ భద్రాచలంగారు ఇండియా నుండి ఆరోజు వచ్చిన ఉత్తరం తీసుకువచ్చి ఇచ్చారు శంకరానికి.

వినరానిది విన్నట్లు విని శంకరం మౌనంగా ఉండిపోయాడు. పరుగులాంటి నడకతో హాల్లోకి వచ్చిన సోఫీ తండ్రి కొడుకులు మౌనంగా ఉండడం చూసి, ఒక్కసారి ఆగి, మెల్లగా అడుగులు వేస్తూ శంకరం దగ్గరికి వచ్చి...

“ఏమైంది?” అని అమెరికన్ యాసతో తెలుగులో అడిగింది. జవాబు లేదు. తల తిప్పి మామగారి వైపు చూసి “ఇవాళ వచ్చిన ఉత్తరం...” అని వాక్యం పూర్తి చెయ్యకుండా ఆగింది.

“అవునమ్మా అదే, శంకరానికి చెపుతున్నాను మీరు పార్టీకి వెళ్ళాలి కదా వెళ్ళిరండి... రేపు సెలవే కదా, రేపు మాట్లాడుదాం” అని భద్రాచలంగారు తన గదివైపు వెళ్ళిపోయారు.

“శంకరం అలా ఎందుకున్నావు.... లే... మొహం కడుక్కొని, బట్టలు మార్చుకో.... మనం కుమార్ ఇంటికి వెళ్ళాలి. ఆరున్నర అవుతున్నది. కమాన్” అని చెయిపట్టుకుని శంకరాన్ని సోఫాలోంచి లేపింది సోఫీ. శంకరం లేచి, మెల్లగా బెడ్ రూమ్ వైపు నడిచాడు.

సోఫీ లివింగ్ రూమ్‌లో కూర్చొని రిమోట్ టి.వి. ఆన్ చేసింది. పీటర్ జన్నింగ్స్ ఎ.బి.సి. ఛానల్‌లో ‘వరల్డ్ న్యూస్ టునైట్’ మొదలు పెట్టాడు. బ్రాంక్సులో ఓ అపార్టుమెంటులో లెక్కలేనన్ని తుపాకులు దొరికాయని, ఆ తరువాత బ్రూక్లిన్‌లో ఓ పార్కులో డ్రగ్స్ అమ్మేవాళ్ళ కార్యకలాపాలు కనుక్కోడానికి అండర్ కవర్ వెళ్ళిన పోలీసు ఆఫీసరుపై ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారని, వింటుంటే వరల్డ్ న్యూస్ కోసం కూర్చున్న సోఫీ తన ఇంటికి ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న ప్రదేశాలలో రోజు జరిగే విశేషాలతో విసుగెత్తి ఛానల్ మార్చింది. ఎన్.బి.సి.లో కూడా అలాంటి వార్తలే ఉండడంతో మరో ఛానల్ మార్చింది.

“సోఫీ, నువ్వూ శంకరం పార్టీలో భోజనం చేసివస్తారు కదా...! మా కోసం ఉప్మా చేస్తున్నాను. రేపు ప్రొద్దున్న ఉప్మా సాండ్‌విచ్ తింటామంటే ఇంకొంచెం ఎక్కువ ఉప్మా చేస్తాను...” లివింగ్ రూమ్‌లోకి వచ్చి అంది, శంకరం తల్లి శారదమ్మగారు.

“అలాగే అత్తయ్యా అది గుడ్ అయిడియా...” అంది సోఫీ టీ.వి. ఆఫ్ చేస్తూ...

ఉప్మా సాండ్‌విచ్ సోఫీ ఆలోచన. పెళ్ళైన కొత్తలో కొద్దిగా మిగిలిపోయిన ఉప్మాని బ్రెడ్ మధ్య పెట్టుకొని తినడం అలవాటు చేసుకుంది. ఆ తరువాత శంకరం ఆవకాయ కానీ పచ్చడి కానీ పెట్టి ఆ సాండ్‌విచ్‌ని ఇంకా రుచిగా మార్చాడు. ఆ తరువాత అది రుచిచూసిన వాళ్ళ స్నేహితులు చాలామందికి నచ్చి వాళ్ళు కూడా అలా చేయడం మొదలు పెట్టారు.

"అత్తయ్యా బడి ఉత్తరం ఓ బేడ్ న్యూసా? ఎందుకలా ఉన్నారు మావయ్యగారు" అని అడిగింది సోఫీ వంటింట్లోకి వెళుతున్న అత్తగారిని అనుసరిస్తూ.

"అవునమ్మా, ఆయన పుట్టి పెరిగింది ఆ ఊర్లోనే... ఆయన చదివింది ఆ బడిలోనే... ఇరవైయవ ఏట టీచరుగా ఉద్యోగం మొదలుపెట్టి హెడ్‌మాష్టారుగా రిటైరైంది ఆ బడిలోనే... గుడికంటే ఆయనకు ఆ బడే ముఖ్యం. ఆ బడి నా గుడి అని గర్వంగా చెప్పుకొనేవారు. ఈ గుళ్ళో వెయ్యిమంది దేవుళ్ళున్నారు. శ్రద్ధతో పాఠాలు చెపితే వీళ్ళు పెద్దవాళ్ళయి ఈ ఊరును స్వర్గం చేస్తారు. ముక్తి కోసం మరెక్కడికో వెళ్ళక్కర్లేదని నమ్మిన మనిషమ్మా ఆయన. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చినపుడు బడిని నమ్ముకొన్నాను, బతుకు పండించుకొన్నాను అని ఎంతో సంతోషపడ్డారు.

"ఆ బడి మంచి చెడ్డలను గురించి మేనేజ్‌మెంటుతో ఆయనకు ఎప్పుడూ తగవులే, అయితేనేం బడి అంతా మీ మామగారి మాట మీదే నడిచేది. రిటైరైపోయినా రోజూ ఆ బడికి వెళ్ళడం, అక్కడ టీచర్లతో కుర్రాళ్ళతో కొంచెంసేపైనా కాలక్షేపం చేయడం ఆయనకు అలవాటు. సైన్సు ఫేరని, భారత్ దర్శనని రకరకాల ప్రాజెక్టులు పిల్లల చేత చేయించడం, బడికి ఇంకా ఎక్కడనుండి డబ్బు తేవాలని ఆలోచించడంలోనే కాలం గడిపేవారమ్మా. శంకరం మమ్మల్ని ఇక్కడికి రమ్మన్నప్పుడు రానని శంకరాన్ని బాధపెట్టలేక వచ్చారు కానీ ఆయన మనసంతా ఆ బడిమీదే ఉందమ్మా. కానీ ఏడాది ఉంటానని వచ్చి మూడు నెలల్లోనే వెళ్ళాలని ఉందంటే శంకరం బాధపడతాడేమో అని ఆయన సందేహం".

"సోఫీ! సోఫీ! త్వరగా రా... టైమైపోయింది" అంటూ శంకరం వచ్చాడు.

"అత్తయ్య బడి గురించి చెప్తున్నారు..."

"అవును నాకు తెలుసు, ఇండియా వెళ్ళాలని నాన్నగారి ఉద్దేశం. ఆయన వెళ్ళి అక్కడ చేయగల్గింది ఏమిటని నా ప్రశ్న. ప్రస్తుతం అంతా వ్యాపారమయం. ఆ బడి మీద డబ్బుపెడితే ఒక్కపైసా వెనక్కి రాదని అందరికీ తెలుసు. బడి మూసేసి ప్రైవేటు స్కూల్ తెరిస్తే మరింత మంది స్టూడెంట్లు వస్తారు. డబ్బు చేసుకోవచ్చునని అందరూ ఎదురు చూస్తున్నారు. ఈయన వెళ్ళి వాళ్ళని మార్చగలరా? ఈయన, నాయుడు మాస్టారు, విశ్వనాథం మాస్టారు ముగ్గురూ కలిసి స్కూలు గోడలు పడిపోకుండా నిలపాలని ప్రయత్నించినా దానికి కావల్సిన డబ్బు ఎక్కడ నుండి తెస్తారు? ఇన్నేళ్ళు శ్రమపడ్డారు. రిటైరయ్యారు కదా! హాయిగా రామా...కృష్ణా... అనుకుంటూ గడిపెయ్యక ఈ వయస్సులో ఇంత పెద్ద పనులు నెత్తిన

వేసుకొంటే చెయ్యగలరా?'' అన్నాడు శంకరం.

''చెయ్యగలనో లేదో నాకు తెలియదు కానీ ఏమీ చెయ్యకుండా ఉండలేను రా...'' అన్నారు వెనకనుండి అప్పుడే అక్కడకు వచ్చిన భద్రాచలంగారు. శంకరం, శారదమ్మగారు, సోఫీ తుళ్ళిపడ్డారు ఆయన మాటలు విని. శంకరం తేరుకొని

''అది కాదు నాన్నా...మీరు...''

''నిజమే శంకరం, నేను ఇక్కడ మీతో అమెరికాలోనే ఉండడం నలుగురికీ, నీకు, నాకు కూడా సబబుగానే తోస్తుంది. నాకు తెలియకుండానే నేను ఆ స్కూలులో ఒక భాగం అయిపోయాను. కాలం ఎల్లకాలం ఒక్కలా ఉండకపోవచ్చు, కాలం మారినా మనిషి మారడం అంత సులభం కాదురా! అయినా తాపీగా ఆలోచిద్దాం, మీకు ఆలస్యం అవుతున్నది పార్టీకి, వెళ్ళిరండి.''

''అలాగే నాన్నా''

''వెళ్ళి వస్తాం అత్తయ్య''

''అమ్మా మేం వచ్చేసరికి పదకొండు గంటలు దాటుతుందేమో మీరు పడుకోండి'' అని శంకరం ముందు, వెనక సోఫీ గ్యారేజ్ వైపు నడిచారు మౌనంగా. కొత్తగా కొన్న హోండా ఎకార్డు కారు ఎక్కి బయలుదేరారు. కారు తాపీగా చిన్న రోడ్లమీద నుండి పోయి ఎక్స్ ప్రెస్ వే చేరింది. శంకరం కారు వేగం పెంచాడు. లాంగ్ ఐలెండ్‌లో ఉన్న కుమార్ ఇంటికి అరగంట ప్రయాణం. సోఫీ కారు స్టీరియోలో ''ఈస్ట్ మీట్స్ వెస్ట్'' క్యాసెట్ పెట్టింది. మెల్లగా సంగీతం మొదలైంది.

''శంకరం! డ్రైవ్ కేర్‌ఫుల్లీ'' అని సోఫీ అనడంతో ఆలోచనలలో మునిగిఉన్న శంకరం ఒక్కసారి తుళ్ళిపడి, కారు వేగం తగ్గించి, సర్దుకుని, ''సారీ'' అన్నాడు.

''నువ్వు ఎదురుగా ఉన్న ఎర్రకారుకు చాలా క్లోజ్‌గా వెళ్ళిపోయావు తెలుసా!'' అంది సోఫీ. కొద్ది సేపట్లో కారు మళ్ళీ వేగం అందుకుంది. మ్యూజిక్ క్యాసెట్ రెండవ వైపుకు మారింది.

''వచ్చేసినట్లున్నాం'' ఆలోచనలలో పరధ్యానంగా మునిగి ఉన్న శంకరం అన్నాడు. ''అప్పుడే ఎక్కడ వచ్చాం?'' మనం ఎగ్జిట్ తీసుకొని బయటకు వచ్చాం ఇంకో ఆరు మైళ్ళు, ఏడు లైట్స్ దాటితే గాని కుమార్ వాళ్ళిల్లు రాదు'' అని ఎలా వెళ్ళాలో దారి చెప్పడం మొదలు పెట్టింది సోఫీ. మరో పది నిమిషాల్లో కుమార్ ఇల్లు చేరుకున్నారు.

''హలో... రండి.... రండి.... ఓ మీరు కూడా వచ్చారా...! చాలా సంతోషం...!'' అంటూ సోఫీని ప్రత్యేకంగా ఆహ్వానించాడు కుమార్.

శంకరానికిది మామూలే.. చాలామంది అయ్యో మేం తెల్ల అమ్మాయిని పెళ్ళి

చేసుకోలేక పోయాం కానీ శంకరం అదృష్టవంతుడనుకొంటారు కాబోలు. లేక మన వాణ్ణి చేసుకొంది, ఎంత మంచిదో అన్న గౌరవమో, అయ్యో ఇంకెవరూ దొరకనట్లు మన వాణ్ణి చేసుకొని ఎలా భరిస్తున్నదోనన్న జాలో, ఇలా రకరకాల భావాలు మనసులో దాచుకొని పైకి మాత్రం మొహం నిండా నవ్వు పులుముకొని రండి... రండని ఆహ్వానిస్తారు. గత ఐదేళ్ళుగా ఇలాంటి రకరకాల మానసిక ప్రవృత్తులను చూసి చూసి వాటిని పట్టించుకోవడం మానేసారా జంట.

పార్టీకి వచ్చిన వాళ్ళు మామూలుగానే ఆడవాళ్ళు ఒకవైపు, మగవాళ్ళు ఒకవైపు, పిల్లలంతా టి.వి. ముందు చేరి మాట్లాడుకుంటున్నారు. శంకరం, సోఫీలను చూడగానే వాళ్ళ మాటలాపి, పలకరించి ఇటు రండని పిలిచారు. ముందు తెలుగులో నమస్కారమని మొదలుపెట్టి ఒకటి రెండు వాక్యాల తర్వాత వాళ్ళకి తెలియకుండానే ఇంగ్లీషులోకి జారిపోయారు. ఇక పిల్లల సంగతి చెప్పక్కర్లేదు. తెలుగు వాళ్ళింట్లో జరిగే పండగలు, పేరంటాలకి వెళ్ళి తన తెలుగు భాషని పెంచుకోవచ్చన్న సోఫీ ఆశ అడియాసే అయ్యింది.

-----------------------

ఇండియాలో ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్ళక ముందు అమెరికాలోనే సోఫీ తెలుగు నేర్చుకోవాలని తెలుగు కుటుంబాలతో పరిచయం చేసుకుంది. కొలంబియా యూనివర్సిటీలో కంప్యూటర్ విభాగంలో పనిచేసే రమణారావు తెలుగు నేర్పుతానంటే రోజూ సాయంత్రం ఆయన వద్దకు వెళ్ళేది. అతను అక్షరాలు మొదలు పెట్టి గుణింతాల వరకు వచ్చిన తరువాత "తెలుగు రాయడం, చదవడం మానేసి చాలా రోజులైంది. అందుకే డిఫికల్టుగా ఉంది. మీకు తెలుగు మాట్లాడడం వస్తే చాలు కదా విశాఖపట్టణంలో ఓ ఏడాది మేనేజ్ అవ్వడానికి కావలసిన స్పోకెన్ తెలుగు మాత్రం టీచ్ చేస్తాను" అన్నాడు.

ఓ వారంరోజులు అతను మాట్లాడే తెలుగు చూసి...

"మీరు మాట్లాడే తెలుగులో మూడు వంతులు ఇంగ్లీషు ఉంది కదా" అని సోఫీ అంటే...

"అవును మీరు చెప్పింది నిజమే. ఇక్కడికి వచ్చే ముందు కూడా ఇండియాలో నేను యూనివర్సిటీలో టీచ్ చేయడం వలన ఆల్వేస్ ఇంగ్లీష్ కమ్స్ ఫస్ట్" అని సిగ్గుపడకుండా నిజం ఒప్పుకున్నాడు.

"మీరు ఇండియా నుండి వచ్చి ఏడాదే అయ్యింది కదా, మీ పిల్లల దగ్గర నేర్చుకొంటాను' అని సోఫీ అంటే, ఆమెని తన పిల్లలకు పరిచయం చేశాడు రమణారావు. వాళ్ళు పొరపాటున కూడా ఒక్క తెలుగు ముక్క కూడా మాట్లాడకుండా...

"సోఫీ ఆంటీ" అంటూ ఇక్కడి కార్టూనులు, సినిమాల గురించిన విశేషాలు గుక్క

తిప్పుకోకుండా ఇంగ్లీష్‌లో చెప్పడం చూసి...

“మీకు తెలుగు రాదా?” అని సోఫీ తను అంతవరకు నేర్చుకున్న తెలుగును పిల్లల ముందు ధైర్యంగా ఉపయోగించింది. సోఫీ ఏం అడుగుతుందో అర్థం కాలేదు వాళ్ళకి. సోఫి తను ఏమని అడిగిందో ఇంగ్లీష్‌లో వివరించి తను మాట్లాడిన తెలుగు వాళ్ళకి అర్థం కానంత ఘోరంగా ఉందా అని అడిగింది. “మేము ఎప్పుడూ తెలుగు మీడియంలో చదవలేదు. కనీసం ఇంటి దగ్గరైనా తెలుగు నేర్చుకోలేదని” ఇంగ్లీషులో చెప్పారా పిల్లలిద్దరు. తల్లిదండ్రులు రమణారావు, సీత వాళ్ళు చెప్పిన విషయాన్నే సమర్థిస్తూ..

“ఇండియాలో సరైన చదువు రావాలంటే ఇంగ్లీష్ మీడియంలోనే పిల్లల్ని చదివించాలి. లేకపోతే వాళ్ళు రేపు టోఫిల్, జిఆర్‌యి లాంటి పరీక్షలు పాసై అమెరికాకి రావాలంటే చాలా కష్టం. అందుకే ఇండియాలో ఉన్నప్పుడు కూడా పిల్లల్ని ఇంట్లో, బయట కూడా ఇంగ్లీష్ మాత్రమే మాట్లాడేట్టు చాలా స్ట్రిక్టుగా చూసే వాళ్ళం” అని గర్వంగా చెప్పారు రమణారావు ఆయన భార్య సీత ఏకగ్రీవంగా.

“పోనీ సీతగారు మీరు నాకు తెలుగు నేర్పితే బావుంటుంది’ అని ఆశగా అడిగింది సోఫీ.

“ఇక్కడకు వచ్చే ముందు వరకు నేను తెలుగులోనే మాట్లాడేదాన్ని కాని ఇక్కడకు వచ్చిన దగ్గర్నుంచి పూర్తిగా ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతున్నా. నాతో ఇంట్లో తెలుగు, స్కూల్లో ఇంగ్లీష్ అయితే పిల్లలు కన్ఫ్యూజ్ అయిపోతారు కదా. మా ఫ్రెండ్స్ కూడా చాలామంది ఇలా టూ లాంగ్వేజెస్ నేర్చుకోవడం పిల్లల చిన్న బ్రెయిన్‌కి టాక్సింగని చెప్పారు. అందుకే నేను తెలుగు మానేసి ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతున్నా. నిజానికి మా ఫ్రెండ్స్ చాలా మంది నేను గుడ్ అమెరికన్ యాక్సెంట్‌తో ఇంగ్లీష్ మాట్లాడుతానని నన్ను ఎంతో అప్రిసియేట్ చేస్తారు.” ఆవిడ ఎంతో స్టైలుగా చెప్పింది. వింటున్నంత సేపూ ఏదో టి.వి.లో సోప్ ఒపెరా పాత్ర మాట్లాడుతున్నట్లే అనిపించింది సోఫీకి.

“నేను నా చిన్నప్పుడు కొన్నాళ్ళు పారిస్‌లో పెరిగాను. ఇంగ్లీష్, ఫ్రెంచ్ మాట్లాడేదాన్ని. మీకీ విషయం తెలుసో లేదో నాకు తెలియదు కానీ రెండు మూడు భాషలు నేర్చుకోవడం వలన పిల్లల బ్రెయిన్ పాడైపోదు సరికదా... ఇంకా చురుగ్గా పనిచేస్తుంది.” అని ఆవేశంతో చెప్పడం ముగించిన సోఫీకి, మౌనంగా ఉన్న దంపతులను చూడగానే ఇన్నాళ్ళూ తనకి వాళ్ళతో ఉన్న స్నేహం ముగిసిపోయిందన్న విషయం అర్థమైంది.

ఆ సంఘటన జరిగిన తర్వాత సోఫీ తెలుగు వాళ్ళని తెలుగులో మాట్లాడమని గానీ, పిల్లలకు నేర్పవచ్చు కదా అని కానీ అనడం మానేసింది. ఎవరైనా పొరపాటున మీకు తెలుగు అర్థం అవుతుందా అని ఆసక్తి కనపరిస్తే మాత్రం తనకొచ్చిన తెలుగు మాట్లాడడం అలవాటు చేసుకుంది.

కుమార్ ఇంట్లో పార్టీలో ఎన్నో రకాల విషయాలు చర్చిస్తూ... కబుర్లలో శంకరం, సోఫీ రాత్రి పదకొండు గంటల వరకు గడిపేశారు. శంకరం ఆలోచనలు మాత్రం 'బడి గోడలు పడిపోతున్నాయి బయలుదేరి రండి' అన్న తండ్రికొచ్చిన ఉత్తరం మీదే ఉన్నాయి. భోజనాలు అయిన తర్వాత కుమార్ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరారిద్దరూ.

"మరో నాలుగు ఇళ్ళు దాటితే మన ఇల్లు. స్లో చెయ్" అని హెచ్చరించింది సోఫీ హైవేలో నడుపుతున్నంత వేగంతోనే మామూలు వీధుల్లో కూడా కారు నడుపుతున్న శంకరాన్ని. ఇల్లు చేరి గ్యారేజ్‌లో కారు పెట్టి ఇంట్లోకి వెళ్ళేసరికి అర్ధరాత్రి అయింది. తల్లి, తండ్రి పడుకున్న గదిలో వెలుగులేదు. పడుకున్నారన్న మాట అనుకొని శంకరం, సోఫీ తమ బెడ్‌రూమ్‌కి వెళ్ళిపోయారు.

"ఏం నిద్రపట్టటం లేదా?" అని నిద్రపట్టక కదులుతున్న సోఫీని అడిగాడు శంకరం.

"ఊ.... వస్తూ ఉంది" నిద్ర పోవడానికి ప్రయత్నిస్తూ అంది. "మీ నాన్నగారు ఇండియా వెళతానంటే నాకూ ఆయనతో వెళ్ళాలనుంది. వెళ్ళి, మళ్ళీ ఆంధ్రా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజ్ గేటు ముందు బస్సు దిగాలనిపిస్తోంది" శంకరం చెవిలో గుసగుసలాడింది.

---------------------------

మర్నాడు ఉదయం నలుగురూ బ్రేక్ ఫాస్ట్ చేస్తూ నిన్న వచ్చిన ఉత్తరం గురించి, భద్రాచలంగారు వెళ్ళాలా, లేదా అన్న విషయం గురించి ఆలోచించారు. ఆయన మనస్సంతా ఆ బడిమీద ఉందని తెలిసిన శంకరం, సోఫీ తమకు ఇష్టం లేకపోయినా, ఆయన్ని వెళ్ళమనే అన్నారు.

"నా మనసు అర్థంచేసుకున్నారు సంతోషం" అని అన్నారాయన.

"నాకు అసలు వెళ్ళాలని లేదు కాని ఆయన ఒక్కరూ వెళ్ళి అక్కడ చాలా ఇబ్బంది పడతారు. అందుచేత నేను కూడా వెళ్ళక తప్పదు" అన్నారు శారదమ్మగారు.

"అలాగే, రేపు ఉదయం టిక్కెట్లు రిజర్వేషన్ పని చూస్తాను" అన్నాడు శంకరం.

వారం రోజుల తరువాత భద్రాచలంగారు, శారదమ్మగారు ఇండియా వెళ్ళిపోయారు. శంకరం, సోఫీ కొంచెం వెలితిగా ఎయిర్‌పోర్టు నుండి ఇంటి ముఖం పట్టారు.



# 2

భద్రాచలంగారు విజయనగరం జిల్లాలో ఒక చిన్న ఊర్లో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. ఆయన పుట్టేనాటికి ఆయన తండ్రి స్వాతంత్ర్యోద్యమంలో పూర్తిగా మునిగి ఉన్నాడు. ఉంటే జైల్లో లేకుంటే ఉద్యమంలో ఊర్లు తిరుగుతూ, పైసా ఆర్జన లేకపోయినా క్షణం తీరికలేకుండా 'మాకొద్దీ తెల్లదొరతనం...' వంటి దేశభక్తి గీతాలు పాడుతూ తిరుగుతూ ఉండేవాడు. పొలంమీద వచ్చే ఫలసాయంతో, ఇంటిమీద వచ్చే అద్దెతో మొదట్లో ఇల్లు జరిగినా, రాను రాను కష్టమైపోయింది. భద్రాచలంగారు పుట్టిన తరువాత, 'ఇప్పుడైనా ఉన్న బి.ఎ. డిగ్రీతో ఏదైనా ఒక ఉద్యోగం చూసుకోండి' అని అన్న భార్యతో, 'ఇంకెంత, మరో రెండు మూడేళ్ళల్లో స్వాతంత్ర్యం వచ్చేస్తుంది. అప్పుడింక ఈ కష్టాలన్నీ తీరిపోతాయి. కావాలంటే ప్రస్తుతానికి ఓ ఎకరం భూమి అమ్ముదాం' అన్నాడు. అలాంటి పరిస్థితిలో ఈ లోకంలోకి వచ్చారు భద్రాచలంగారు.

భద్రాచలం గారు పుట్టిన పదేళ్ళ తరువాత భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. భర్త ఇకనుండైనా ఇంటిపట్టున ఉండి ఉద్యోగం చేసి, డబ్బు సంపాదిస్తే ఇల్లు హాయిగా గడుస్తుందని అతని తల్లి ఆశపడింది. కానీ స్వాతంత్ర్యం వచ్చినా, అధికారం మారినా అధికారులలో మార్పు రాలేదు. భద్రాచలంగారి తండ్రికి ఉద్యోగం దొరకలేదు. వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. భద్రాచలంగారి స్కూల్ ఫైనల్ చదువు పూర్తి అయ్యేసరికి ఉన్న భూమి, బంగారం తరిగిపోయాయి. భద్రాచలంగారికి ఉన్న ఊర్లోనే టీచరుగా ఉద్యోగం వచ్చింది. దారిద్ర్యానికి బాగా చేరువలోకి వచ్చిన ఆ కుటుంబం అతని ఉద్యోగంతో దారిద్ర్యం దరిచేరనీయకుండా చేసుకుంది. టీచరుగా చేరిన మొదటి పదిహేను సంవత్సరాలలో బి.ఎ., బి.ఇడి., ఎం.ఎ., ఎం.ఇడి. కూడా పూర్తి చేసి హెడ్ మాస్టారు అయ్యారు భద్రాచలంగారు.

"హెడ్ మాస్టారుగా ఎంతకాలం? ఎదుగు బొదుగు ఇంకేం ఉండదు. ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో మీదకు వెళ్ళడానికి ఇది గవర్నమెంటు స్కూలు కూడా కాదు. ఇది కేవలం ఎయిడెడ్ స్కూల్. ఇది ఇంతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే పడి ఉండే తంతు. అందుచేత ఏదైనా ఓ జూనియర్ కాలేజిలో లెక్చరర్‌గా ప్రయత్నించకూడదా? ఇపుడు ఎక్కడబడితే అక్కడ జూనియర్ కాలేజీలు వస్తున్నాయి. ఇలా బడిపంతులు జీతంతో పడిపోతున్న ఇంటి పెంకుని మళ్ళీ మళ్ళీ సర్దించి, ఇక్కడ ఇంత సిమెంటు రాయించి అక్కడ అంత సున్నం కొట్టించి ఈ పాత కాలం ఇల్లు నిలబెట్టకపోతే, ఎక్కడైనా ఓ లెక్చరర్ ఉద్యోగం చూసుకొని దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో, ఓ నాలుగు రాళ్ళు వెనకేస్తే, నీ కొడుకైనా మంచి స్థితి పరుడవుతాడు" అని భద్రాచలంగారి బాగుకోరిన వాళ్ళు చెప్పారు.

బి.ఇడి. పరీక్షలు రాసి ఇంటికి రాగానే తండ్రి "నీతో మాట్లాడాలిరా భద్రాచలం!"

అని పిలిచాడు. ఆయన ఏదో మనోవ్యాధితో బాధపడుతున్నవాడిలా తిరుగుతూ ఉండేవాడు. ఎక్కువగా ఎవరితో మాట్లాడేవాడు కాదు. ఏదో తప్పు చేసినవాడిలా తలవంచుకొని ఉండేవాడు. ముఖంలోకి చూసి మాట్లాడేవాడు కాదు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ జెండా చేతిలో పట్టుకొని, దేశభక్తి గీతాలు గొంతు నిండా నింపుకొని, రవి అస్తమించని రాజ్యాన్ని తానొక్కడే ఎదిరించగలనన్న ఆత్మవిశ్వాసం గుండె నిండా నింపుకొని ఒకనాడు తిరిగిన మనిషి అతను. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంతా మారిపోతుంది అనుకునే వాడు అది రాకముందు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచినా జరిగిన మంచి కంటే జరుగుతున్న అన్యాయాలే ఎక్కువైపోయాయని వాపోయేవాడు.

కులతత్వం ఇంతకు ముందుకన్నా ఎక్కువైపోయింది. ప్రజాసేవకి ఎప్పుడూ ముందుకు రానివాళ్ళు పదవుల కోసం ముందుకు వచ్చి అందలాలు ఎక్కుతున్నారు. పూర్వం బ్రిటిష్ వాళ్ళవెంట తైనాతీల్లా తిరిగిన దేశద్రోహులే నేడు రాజకీయాల్లో పెద్దమనుషులైనారు. పూర్వం కాంగ్రెస్ వాళ్ళని వెలివేసి, కాంగ్రెస్ సమావేశాలను చెడగొట్టి, పోలీసులతో చేతులు కలిపి, ఉపన్యాసాలిచ్చే వాళ్ళని, కాంగ్రెస్ జెండా పట్టుకొన్న వాళ్ళని పట్టించి జైళ్ళలోకి నెట్టించినవాళ్ళే ఈనాటి కాంగ్రెస్‌లో మెంబర్లు, నాయకులు. వందేమాతరం పూర్తిగా రానివాళ్ళు, జాతీయ గీతం జనగణమణని పూర్తిగా పాడలేని వాళ్ళు, అనర్హులైనవాళ్ళు ఈ స్వాతంత్ర్య భారతదేశాన్ని తమ స్వంత జాగీరులా తమకిష్టం వచ్చినట్లు నడుపుతున్నారు.

ఈ స్వాతంత్ర్యం వెనుక ఎన్ని వేలమంది పచ్చని జీవితాలు బ్రిటిష్ తుపాకులకు గురియై కాలి, మసి అయిపోయాయో, ఎంతమంది వెచ్చటి నెత్తురు చల్లారి గడ్డకట్టి పునాదుల్లో కలిసిపోయిందో తెలుసుకోకుండా, వారిని త్రికరణ శుద్ధితో తలచుకోకుండా ఏ కొద్దిమంది నాయకుల ఫోటోలకో పూలమాలలు వేసి, వాళ్ళ పేర్లు చెప్పుకొని బాల భారతాన్ని ఏ కులాల కీకారణ్యంలోకో, స్వార్థపుటెడారులలోకో తీసుకొని పోతున్నారు. ఇందుకోసమా ఓ నిండు జీవితాన్ని వెచ్చించాను, ఇందుకోసమా ఓ పండంటి సంసారాన్ని పూట పూటకి తిండి వెతుక్కోవల్సిన స్థితికి తీసుకువచ్చాను, ఇందుకోసమా చక్కని భవిష్యత్తున్న కొడుకుకి కాలేజీ వరకైనా చదువు చెప్పించ లేకపోయానని, సుళ్ళు సుళ్ళుగా తిరిగే ఆలోచనలలో ఏ ఒక్కటీ బయటకు అనలేక, "భద్రాచలం, తండ్రిగా నీకు నేను చేసింది ఏమీ లేకపోయినా కొడుకుగా నువ్వు నాకు అన్నీ సరిగ్గా చూశావు. చెయ్యవలసినదంతా చేశావు. నాకు చాలా ఆనందంగా ఉంది. నాలా అశ్రద్ధ చేయక నీ పిల్లలకి పెద్ద చదువులు చెప్పించుతావు కదూ?" అని కన్నీళ్ళు పెట్టుకుని అడిగిన నాలుగు రోజుల తర్వాత ఆయన సునాయాసంగా ప్రాణాలు విడిచారు.

ఆయన పోయిన ఓ సంవత్సరం తర్వాత శంకరం పుట్టాడు. భద్రాచలంగారి తల్లి తన భర్తే మనవడిగా పుట్టాడని మురిసిపోయింది. వీడిని మాత్రం సంఘసేవ, దేశభక్తి అంటూ తిరగనివ్వను. చక్కగా చదువుకోమని చెప్తానంటూ అందరితో చెప్పేది. శంకరానికి

ఐదో ఏడు నడుస్తుండగానే ఆవిడ కూడా కన్ను మూసింది. ఆవిడ కూడా చనిపోయే ముందు మనవణ్ణి పెద్ద చదువు చదివించమని భద్రాచలం దగ్గర నుండి మాట తీసుకుంది. ఏమాట, ఏనాడు నోరు తెరిచి అడగని తల్లి కూడా అడగడంతో ఎక్కడైనా కాలేజీ లెక్చరరుగా ఉద్యోగం సంపాదిద్దామా అని ఆలోచిస్తూ ఓ రాత్రి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్న భద్రాచలంగారు "మాస్టారు.... మాస్టారు......" అన్న కేకలు విని పక్క దిగి వచ్చి తలుపుతీసి చూస్తే రోజూ వచ్చే ట్యూషన్ కుర్రాళ్ళు కనిపించారు. రాత్రంతా అలా ఆలోచిస్తూనే గడిపానా.... అని ఆశ్చర్యపోయారాయన.

భద్రాచలంగారి దినచర్య ఉదయం నాలుగున్నరకి మొదలవుతుంది. రెండు బ్యాచీల ప్రైవేటు కుర్రాళ్ళు వెళ్ళేసరికి ఏడు గంటలు అవుతుంది. తరువాత వార్తలు విని స్నానం ముగించి ఎనిమిది గంటలకి స్కూల్‌కి వెళ్ళడం. వెళ్ళగానే స్కూల్ తోట, భవనం అంతా తిరిగి మొక్కల్ని, గదుల్ని పరిశీలించి వాటిని గురించి శ్రద్ధ తీసుకుంటున్న మాలీలతో, పనివాళ్ళతో మాట్లాడడం. ఎనిమిదిన్నరకల్లా ఆఫీసు గదికొచ్చి ఆ రోజు రాయాల్సిన ఉత్తరాలు, పెట్టాల్సిన సంతకాల పని చూడడం. తరువాత తొమ్మిది గంటలకి ప్రార్థన సమావేశానికి హాజరవడం, తర్వాత మొదటి పీరియడ్ పాఠం చెప్పి తిరిగి ఆఫీసుకు వచ్చి ఆ రోజు వచ్చిన ఉత్తరాలు చదవడం, మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి ఓ అరగంట వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకోవడం, తిరిగి స్కూల్‌కి వెళ్ళడం, ఒక్కొక్క రోజు ఒక్కొక్క టీచరుతో గడిపి వాళ్ళు పాఠాలు ఎలా చెపుతున్నారో తెలుసుకోవడం, తగిన సూచనలు ఇవ్వడం, మధ్యాహ్నం మరో తరగతికి పాఠం చెప్పడం, తర్వాత స్కూల్ గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదవడం కానీ లేదా సైన్సు ప్రాజెక్టు కానీ, సోషల్ ప్రాజెక్టు కానీ చేస్తున్న విద్యార్థులకు సహాయం చేయడం. సాయంత్రం ఆరుగంటల నుండి ఓ గంటసేపు తన స్నేహితులైన విశ్వనాథం మాస్టారు, నాయుడు మాస్టారుతో ఊరిలో ఉన్న పార్కుకు వెళ్ళి కబుర్లు చెప్పుకోవడం (అందులోనూ ఎక్కువ బడికి సంబంధించిన విషయాలే ఉండేవి), ఏడు గంటలకి ఇంటికి రావడం, కొంచెంసేపు కొడుకు చదువు సంగతి చూడడం, ఆ తర్వాత రాత్రి భోజనం, కాసేపు పుస్తకాలు చదువుకోవడం, పడుకోవడం, ఇది భద్రాచలం మాస్టారి దినచర్య ప్రతీ వారం, ప్రతీ నెలా, ప్రతీ ఏడు.

ఆదివారం ఇంట్లోకి కావల్సిన పప్పుదినుసులు, కూరగాయలు కొందామని బజారుకి వెళితే దారి పొడువునా ఊళ్ళో వాళ్ళు....

"మాస్టారు మావాడెలా చదువుతున్నాడు? మార్కులు బాగా వస్తున్నాయా? ఏ సబ్జెక్టు చదివిస్తే బావుంటుందంటారు?" అని సలహాలు అడుగుతారు. సెలవులకు వచ్చిన పాత విద్యార్థులు ఆయన్నింకా మరిచిపోలేక వాళ్ళ చదువులు, ఉద్యోగాల వివరాలు చెపుతూ....

"మీ చలవ వల్లనే ఈ రోజు ఈ స్థితిలోఉన్నాం" అని కృతజ్ఞతలు తెలుపుకుంటారు.

ఆ ఊరి విద్యారంగంలో ఓ కీలకమైన పాత్రలోఉండి, విద్యార్థుల, ఊళ్ళోవాళ్ళ అభిమానంతో క్షణం తీరికలేకుండా ప్రతీక్షణం బడిని ఇంకా మంచి బడిగా తీర్చి దిద్దడంలో హాయిగా జీవితం గడుపుతున్న తనకు ఎక్కువ డబ్బుల కోసం ఈ బడిని వదులుకొని పై ఊరు వెళ్ళి సాధించేది ఏముంది అనిపించింది. తన బాగు కోరేవాళ్ళ మాటలు, కొడుకు భవిష్యత్తు గుర్తుకు వచ్చి మరో మారు మనసు ఊగిసలాడింది. ఈ బడిలో ఉద్యోగం ఉన్నంతవరకు హాయిగానే గడిచిపోతుంది. ఒక్కడే కొడుకు... ఇంక పిల్లలు వద్దనుకొన్నారు. తను రిటైరయ్యేనాటికి కొడుక్కి పాతికేళ్ళు దాటిపోతాయి. ఓ డిగ్రీ తప్పకుండా చేతికి వస్తుంది. ఈలోగా వచ్చే జీతం, ఇవ్వగలిగిన వాళ్ళు ఇచ్చినంత, లేనివాళ్ళు లేనట్లుగా జరిగే ప్రైవేట్ల వల్ల వచ్చే డబ్బు వేడినీళ్ళకి చన్నీళ్ళ తోడులా జీవితం సాఫీగానే సాగిపోతుందనుకొని సమాధాన పడ్డారు.

ఇలాంటి ఆలోచనలలో ఊగిసలాడుతున్న భద్రాచలంగారు టైఫాయిడ్ జ్వరం వచ్చి ఓ నెలరోజులు మంచాన పడి ఇంట్లో ఉండిపోవాల్సి వచ్చింది. జ్వరం రెండు వారాల్లో తగ్గిపోయినా డాక్టరు కనీసం మరో రెండు వారాలైనా విశ్రాంతి తీసుకోవాలని ఖచ్చితంగా చెప్పాడు. వేరే దారిలేక ఆయన ఇంట్లోనే ఉండి పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేసినా బడికి వెళ్ళాలన్న కోరికను ఆపుకోవడం కష్టమైపోయింది. లేగదూడని తల్లినుండి వేరుచేస్తే అరిచే అరుపులా బడికి వెళ్ళలేని ఆయన మనసు ఆక్రోశించేది. నెలరోజుల తర్వాత బడికి వెళ్ళగానే జాతరలో తప్పిపోయి, తల్లికోసం ఏడుస్తూ తిరిగి తిరిగి అలసిపోయిన పిల్లవాడికి తల్లి కన్పించినంత ఆనందం కలిగింది బడి చూడగానే. ఆరోజు సాయంత్రమే ఆ బడి ఆవరణలో నడుస్తూ తీసుకొన్న నిర్ణయం ప్రకారం ఆయన ఇంకెప్పుడూ లెక్చరర్ ఉద్యోగానికి గానీ, మరే ఉద్యోగానికి కానీ ప్రయత్నించలేదు. తన జీవితం ఆ బడితో ముడిపడి ఉందని, అదే తన ప్రాణం అని ఆయన తన ప్రమేయం లేకుండానే తెలుసుకున్న అనుభూతికి లోనయ్యారు.

----------------------------

శంకరం ఇంజనీరింగ్ డిగ్రీలో చేరగానే భద్రాచలంగారు తలమీద నుండి భారం దించుకున్నవాడిలా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. శంకరం ఇండియాలో ఇంజనీరింగ్ డిగ్రీ తీసుకున్న తరవాత అమెరికాలో ఎం.ఎస్. చెయ్యడానికి న్యూయార్క్ వచ్చాడు. శంకరం అమెరికా వెళ్ళడం గురించి భద్రాచలంగారు, శంకరం కంటే ఎక్కువ ఆనందించారు. తన తండ్రికి, తల్లికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానన్న తృప్తి కలిగింది. ఇక తన జీవితంలో అన్ని పరీక్షలు పూర్తి అయినవని అనుకున్నారు. కానీ అప్పుడే ఆయనకు జీవితంలో నిజమైన పరీక్ష మొదలైంది. తమ బడి కరస్పాండెంట్ బడి ఆదాయంలో నుండి బడికి కావలసిన ఖర్చులు సరిగ్గా పెట్టక దొంగ లెక్కలు రాయించడం తెలుసుకున్న భద్రాచలంగారు తప్పులు చూపించి అడగడం మొదలుపెడితే, నవ్వి మీ వాటా మీకు ఇచ్చేస్తాం అన్నారు మేనేజ్‌మెంటు

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Turpu+Badi+Padamara+Gudi

* * *